

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, ఇతర పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్‌ను 2023-24 సంవత్సరం గాను జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 29 తేదీ లోపల చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని ఉప ఖజానా కార్యాలయాలలో నమోదు చేసుకోవాలని ఉపసంచాలకులు,జిల్లా ఖజానా, గణాంక కార్యాలయం, రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సర్టిఫికేట్ ఆన్ లైన్లో రానివారు ఆయా ఉప ఖజానా కార్యాలయంలో నేరుగా వచ్చి లైఫ్ సర్టిఫికేట్ సమర్పించాలన్నారు. అంతే కాకుండా 2023- 24 సంవత్సరంగాను ఇన్ కంటేక్స్ రికవరీ సంబంధించి సేవింగ్స్ ఫామ్స్, ఎంత తగ్గింపు చేయాలనే విషయాలు ఆయా ఉపఖజానా కార్యాలయాల్లో నేరుగా వచ్చి జనవరి 20వ తేదీ లోపల సమర్పించాలని తెలిపారు.

30వ రోజూ అంగన్వాడీల సమ్మె


కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న అంగన్వాడీ దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం కొనసాగిస్తున్న సమ్మె బుధవారం 30వ రోజు కొనసాగింది. రిలే దీక్షలు చివరి రోజు చిత్తూరు, కుప్పం ప్రాజెక్టు నుంచి అంగన్వాడీలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత మాట్లాడుతూ రాష్ట్రచరిత్రలో వీరోచితమైన పోరాటంలో ప్రధానమైన పోరాటం అంగన్వాడీల సమ్మె అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను రోజురోజుకీ ఉక్కుపాదంతో అణిచివేయడానికి నోటీసులు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నదని, ఎస్మా చట్టం వర్తించనప్పటికీ అంగన్వాడీలకు వర్తించేలా జీవో నెంబర్ 2 చేసుకొచ్చి ఆందోళనకు గురి చేస్తున్నదని, అయినప్పటికీ వెనక్కి తగ్గకుండా సమ్మె కొనసాగుతున్నదని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే రాత్రింబవళ్లు రిలేదీక్షలు చేసిన ఘనత కూడా అంగన్వాడీలకే దక్కుతుందన్నారు. ప్రధానమైన సమస్యలు పరిష్కారం చేయకుండా చాలా సమస్యలు పరిష్కారం చేశామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. కేవలం రూ.1000లు మాత్రమే పెంచేసి అంగన్వాడీలకు అన్నీ చేసాం, మేము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4500లు పెంచామని అబద్ధాలు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహవరించాల్సిన ముఖ్యమంత్రి బాధ్యతారహితంగా వ్యవహవరించడం దురదష్టకరమని అన్నారు. మంత్రులు అదేబాట పట్టారని రాష్ట్ర ప్రజానీకానికి తప్పుడు మెసేజ్ ఇవ్వడం వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ఇచ్చిన మాట నిలబెట్టుకొని అంగన్వాడీలకు కనీస వేతనాలు, సుప్రీంకోర్టు చెప్పినట్లు గ్రాట్యూటీ, మినీసెంటర్ల మెయిన్ సెంటర్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలపై వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ఎస్మా చట్టాన్ని తీసుకురావడం దారుణమన్నారు.

అంగన్వాడీలకు యుటిఎఫ్ మద్దతు

కలెక్టరేట్ వద్ద జరుగుతున్న అంగన్వాడీల రిలే దీక్షలకు యుటిఎఫ్ నాయకులు మద్దతు ప్రకటించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు యుటిఎఫ్ అండగా ఉంటుందని రాష్ట్ర కార్యదర్శి జివి రమణ హామీ ఇచ్చారు. అంగన్వాడీల కోర్కెలు న్యాయమైనవని వాటిని పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యవైఖరి సరైంది కాదన్నారు. యుటిఎఫ్ నుంచి మద్దతు ఇచ్చిన వారిలో రెడ్డప్ప నాయుడు, పార్థసారథి, శేఖర్ ఉన్నారు. ఈ సందర్భంగా పార్థసారథి ఉపాధ్యాయులు పాటలతో అంగన్వాడీలను ఉత్తేజపరుస్తూ ఆలపించారు. అంగన్వాడీ జిల్లా నాయకురాలు సుజని, మమత, కుప్పం ప్రాజెక్టు నాయకులు సరళ, భారతి, ఐఎఫ్‌టియు నాయకులు మోహన్‌లక్ష్మి పాల్గొన్నారు.


వెదురుకుప్పంలో పిల్లల తల్లులు మద్దతు

వెదురుకుప్పం: కార్వేటినగరం మండల కార్యాలయం ప్రాంగణంలో 30 రోజులుగా కొనసాగుతున్న అంగన్వాడీ ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ పిల్లల తల్లులు నిరసన శిబిరానికి చేరుకొని అంవాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


బైరెడ్డిపల్లిలో 30 ఆకారంలో

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు శకుంతలమ్మ ఆధ్వర్యంలో బుధవారం 30వ రోజూ సమ్మెను కొనసాగించారు. ఈసందర్భంగా 30 వరుస క్రమంలో కూర్చొని నిరసన తెలిపారు.

ఉన్నతాధికారుల 'చేతి'వాటం
తిరుపతిలో శానిటేషన్ 'మాఫియా'
అధికార పార్టీతో సమ్మె 'విచ్ఛిన్నకుల' లాలూచీ

ఎర్రజెండా ముసుగులో అధికార పార్టీకి తాకట్టు

'అందరూ ఇన్‌స్పెక్టర్లకు, మేస్త్రీలకు నమస్కారం.. మన సమ్మె ప్రభావంతో తిరుపతి నగరం అంతా చెత్త కుప్పలతో నిండిపోయింది. దీనికితోడు వర్షం వల్ల చెత్తకుప్పలు కుళ్లి దుర్వాసన వస్తోంది. ఫలితంగా అంటువ్యాధులు ప్రబలే ప్రభావం ఉంది. ప్రభుత్వం మన పట్ల కనీస ధర్మం పాటించకపోయినా, మనం తిరుపతి ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారుల విజ్ఞప్తి మేరకు రేపు స్వచ్ఛంద సేవ చేయాలని నిర్ణయించడమైనది. ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు అందరూ సమ్మెలో పాల్గొంటూనే స్వచ్ఛందంగా సేవకు సన్నద్ధం కావాలని యూనియన్ విజ్ఞప్తి చేస్తోంది. ప్రతి లీడర్ మన జెండా, మన కోర్కెల బ్యానర్ ప్రదర్శిస్తూ పుర పారిశుధ్యంలో రేపు పాల్గొనాలని కోరుతున్నాం.. త్వరలోనే శుభవార్త వస్తుందని ఆశిస్తున్నాం. ఇట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్, తిరుపతి' అంటూ ఓ రాష్ట్ర స్థాయి నాయకుడు పై విధంగా మెసేజ్ పెట్టి స్వచ్ఛంద సేవను నిరవధిక సమ్మెలో ఉన్న కార్మికులతో చేయించడం గమనార్హం.

జిల్లావ్యాప్తంగా గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి మున్సిపాలిటీల్లో సిఐటియు ఆధ్వర్యంలో వీరోచితంగా మున్సిపల్ పార్మికులు 'ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్' (సిఐటియు) ఆధ్వర్యంలో పోరాడుతుంటే, తిరుపతిలో నిర్వీర్యం చేసేలా ఆ రాష్ట్ర కార్మిక నాయకుని చర్యలు 'ఎర్రజెండా'కే తలవంపులు తెచ్చేలా 'స్వచ్ఛంద సేవ'ను కార్మికులతో చేయించడం కార్మికులు డోలాయమానంలో పడేలా చేసిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇదంతా కూడా 'శానిటేషన్ మాఫియా'లో భాగమేనా? అన్న అనుమానం కలగక మానదు.



తిరుపతిలో అధికార పార్టీతో లాలూచీపడి సమ్మె విచ్ఛిన్నకుల 'స్వచ్ఛందసేవ'

పారిశుధ్య పనుల పర్యవేక్షణ


పారిశుధ్య పనుల్లో నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రజల సహకరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పిలుపునిచ్చారు. మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికుల సమ్మె నేపథ్యంలో కమిషనర్ బుధవారం ఉదయం నగరంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రధాన రహదారులు, కూడళ్లను పరిశీలించి పారిశుధ్య పనుల నిర్వహణపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో నిర్దేశించుకున్న ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రకారం అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలన్నారు. ఈసందర్భంగా కమిషనర్ 38వ వార్డు పరిధిలో ఏఎస్ఎం వీధిలో స్థానిక కార్పొరేటర్ ఉన్ని కష్ణన్‌తో కలిసి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. కాలువల్లో పూడిక తీసి, చీపురు చేత పట్టి విధులను శుభ్రం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరంలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు డ్వాక్రా మహిళలు, యువత, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య, మేస్త్రిలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల అర్ధనగ్న నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మున్సిపల్ పారిశుధ్యం, ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె బుధవారం 8వ రోజు కొనసాగింది. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా కాలయాపన చేస్తూ మొండివైఖరి అవలంభిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నదని, దీనికి వ్యతిరేకంగా కార్మికులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు, ఇంజనీరింగ్ విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గంజి రామ్మూర్తి మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం మొండివైఖరి అవలంభిస్తున్నదని తీవ్రంగా విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కూలిపోవడం తథ్యమన్నారు. ఇప్పటికైనా జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

హెల్త్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సామాన్య ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ ఎస్.అముద తెలిపారు. నగరపాలక పరిధిలో బుధవారం 12, 43 వార్డు సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాలు విజయవంతంగా జరిగాయి. 43వ వార్డులో జరిగిన వైద్య శిబిరాన్ని మేయర్ పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో అందుతున్న వైద్యసేవలను పరిశీలించి రోగులకు జగనన్న కిట్లను, మందులను పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతితో కలిసి ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. 12వ సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, కార్పొరేటర్లు, వైద్యాధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్న మేయర్ అముద

పూతల'పట్టు' ఎవరికో..!

- వైసిపిలో ఆశావాహులు క్యూ
- ఎంఎస్‌బాబుకు సీటు లేనట్లే..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అధికారం మరోసారి చేజిక్కించుకోవడం కోసం జగన్ వ్యూహ(సీట్ల)రచన చేస్తున్నారు. తానే స్వయంగా అభ్యర్థుల ఎంపికకు రంగంలోకి దిగారు. తెలంగాణాలో అధికారంలో ఉన్న కెసిఆర్ ఓటమి పాలుకావడంతో సీట్ల విషయంలో మరింత 'పట్టు' బిగిస్తున్నారు. తొలి సర్వేలో పూతలపట్టు ఎంఎల్ఎ ఎంఎస్‌బాబుకు సీటు ఇస్తే ఓడిపోతారని వచ్చింది. 'బాబు తప్పుకోండి' అంటూ తాడేపల్లిలో మర్యాదగా చెప్పారు. దీంతో ఆశావాహులు పూతలపట్టు సీటు కోసం క్యూ కడుతున్నారు. మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సునీల్ పేరు ప్రధానంగా వినిపిస్తున్నప్పటికీ తాను డబ్బు ఖర్చు పెట్టుకోలేనని, పార్టీ సాయం చేస్తే గెలిచి తీరుతానని చెబుతున్నట్లు సమాచారం. మరోపక్క మాజీ ఎంపి డాక్టర్ శివప్రసాద్ సోదరి నారమల్లి పద్మజ సైతం ఈ సీటుపై ఆశ పెట్టుకున్నారు. యాదమరి ఎంపిపి సురేష్, పలమనేరు మాజీ ఎంఎల్ఎ లలితా థామస్, గుంటూరుకు చెందిన ఓ ప్రముఖ డాక్టర్ సైతం సీటు కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఎంఎస్‌బాబు మాత్రం దింపుడుకల్లెం ఆశతో చివరి నిమిషంలో అయినా తనకు అవకాశం ఇస్తారని నిరీక్షిస్తున్నారు. బెంగుళూరులో సామాన్య బిల్డర్‌గా సెటిలైన ఎంఎస్‌బాబు జగన్ క్రేజ్‌లో ఎంఎల్ఎగా గెలుపొందారు. అయితే పూతలపట్టులో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయడంలోనూ,



అభివృద్ధి పరచడంలోనూ అతని పట్ల అసంతృప్తి నెలకొందని సమాచారం. ముఖ్యంగా అతనిపై అవినీతి ముద్ర ఉందని కార్యకర్తలే ఆరోపిస్తున్నారు. ఏమైనప్పటికీ పూతలపట్టు పైన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఆశావాహులు తాడేపల్లి జగన్ క్యాంపస్‌లో క్యూలో ఉన్నారు. మరి ఆ సీటు ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

22న ఓటర్ల జాబితా విడుదల


పోలింగ్ కేంద్రాలలో వసతులపై ప్రత్యేక దృష్టి: డిఆర్ఓ


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 22వ తేదీన ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నందున డిసెంబర్ 9 వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి విచారణ ఈనెల 12వ తేదీతో ముగుస్తుందని, దరఖాస్తులు మాత్రం నిరంతరం స్వీకరించడం జరుగుతుందని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాట్లకు సంబంధించి దృష్టి కేంద్రీకరించడం జరుగుతోందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఉదయం డిఆర్ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి విచారణ 12వ తేదీతో ముగుస్తుందని 22వ తేదీన ఓటర్ల జాబితా విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రధాన కేంద్రాలలో, విద్యాసంస్థలలో ఓటర్ల అవగాహన కోసం ఈవీఎంలను ఉంచడం జరుగుతుందని అన్నారు. ఓటర్ల జాబితాలో చోటు కోసం దరఖాస్తులు నిరంతరం స్వీకరించడం జరుగుతుందని పార్టీల ప్రతినిధులకు తెలిపారు. ఎన్నికల కమిషన్ పోలింగ్ కేంద్రాల్లో కొన్ని నిర్దిష్ట ప్రమాణాలతో వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించడం జరిగిందని ఆ విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతోందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి వసతులు కావాలని కోరగా పరిశీలిస్తామని అన్నారు. సిపిఎం నుంచి గంగరాజు, టిడిపి నుంచి సురేంద్ర కుమార్, వైయస్సార్సీపి నుంచి ఉదయ్ కుమార్ ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయండి: జెడ్‌పి సీఈవో

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పూర్తిస్థాయిలో 2024-25 వార్షిక ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేయాలని జెడ్పి సిఈఓ ప్రభాకర్ రెడ్డి సంబంధితశాఖ అధికారులకు సూచించారు. బుధవారం జెడ్పి సమావేశపు మందిరంలో రెండవరోజు గ్రామపంచాయతీల అభివృద్ధి వార్షిక ప్రణాళికా 2024-25పై జిల్లాస్థాయి అధికారులు, ఎంపీడీఓలు, ఈఓపిఆర్ అండ్ ఆర్‌డి, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈలు, మండలానికి ఒక పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పి సిఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన వార్షిక ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని, గ్రామాల అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, గ్రామ పంచాయతీ స్థాయి నుండి ప్రతి సిబ్బంది గత అనుభవాలను ఉపయోగించి జిల్లాకు ఉపయుక్తమైన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సభలను విజయవంతం చేయాలన్నారు. వార్షిక ప్రణాళికను తయారు చేయడానికి సూచించిన అన్ని దశలను క్రమంగా పూర్తి చేస్తూ జనవరి 31 లోపు ఈ - గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో అప్ లోడ్ చేయాలని తెలిపారు. దాదాపు 30 వివిధ శాఖల ద్వారా సమాచారం సేకరించి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి డిపిఆర్సి కోఆర్డినేటర్ షణ్ముఖ రామ్, పలమనేరు డిఎల్‌డిఓ ఉమావాణి, ఎంపీడీవోలు ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పి సిఈఓ ప్రభాకర్‌రెడ్డి

గృహ నిర్మాణాలకు స్థలసేకరణ పూర్తి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలో జరుగుతున్న మూడోవిడత రీసర్వే పనులకు సంబంధించి గ్రామ సచివాలయ రెవెన్యూ సెక్రటరీలు, తహశీల్దార్ స్థాయి నుంచి 11వ తేదీకి పూర్తి చేస్తామని, గృహనిర్మాణాలకు సంబంధించి సేకరిస్తున్న భూములను వెంటనే అప్పగించడం జరుగుతుందని, ఫ్రీ ఓల్డ్‌రైట్స్‌కు సంబంధించి ఈ కేవైసీ పూర్తి అయిందని ఇన్చార్జి కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్, ఇతర జాయింట్ కార్యదర్శులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్చార్జి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మూడోవిడత ఈ సర్వే 106 గ్రామాలలో జరుగుతోందని, విలేజ్ సర్వే లాగిన్‌లో రెండు గ్రామాలున్నాయని, తహశీల్దార్ లాగిన్‌లో 18 మండలాలు ఉన్నాయని 11వ తేదీలోగా వీటిని పూర్తి చేస్తామని తెలిపారు. అదేవిధంగా మూడో విడతకు సంబంధించి 10048 సర్వే రాళ్ల ప్రతిపాదనలు పంపడం జరిగిందని ఇప్పటికే 60,583 సర్వేరాళ్లు అందజేయడం జరిగిందని 5వేల సర్వే రాళ్లు నాటడం జరిగిందని తెలిపారు. జిల్లాస్థాయిలో ఫ్రీ ఓల్డ్‌రైట్స్‌కు సంబంధించి ఈ కేవైసీ పూర్తి అయిందని తెలిపారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగిందని కోర్టు కేసులు లేని ప్రాంతాలలో, కోర్టు కేసుల తీర్పు వచ్చిన ప్రాంతాలలో పట్టాలు ఇచ్చే కార్యక్రమం వెంటనే చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ కార్యదర్శి మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు అవేర్నెస్ కల్పించేందుకు నోడల్ అధికారులను జిల్లాకు ఇద్దరిని నియమించడం జరుగుతుందని వారికి త్వరలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, వారిని వెంటనే గుర్తించాలన్నారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని జాయింట్ కలెక్టర్ సిసిఎల్ఏ కార్యదర్శిలకు వివరించారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, ఏడి సర్వే గౌస్ అహ్మద్, సర్వే అధికారి గణేష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మురళి, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు జగనన్న తోడు నిధులు విడుదల

జిల్లాలో 15,085 మందికి రూ.15.96 కోట్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి 8వ విడత జగనన్న తోడు కార్యక్రమాన్ని ఈనెల 11న తాడేపల్లి నుండి వర్చువల్‌గా ప్రారంభించనున్నారని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ పి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ విడత జగనన్న తోడు కార్యక్రమం ద్వారా జిల్లాలో 15,085 మందికి రూ.15.96 కోట్లు లబ్ది చేకూరనుందన్నారు. క్రమం తప్పకుండా బ్యాంక్ రుణాలను తిరిగి చెల్లించిన చిరువ్యాపారులకు, సాంప్రదాయ వృత్తివ్యాపారులకు ప్రభుత్వం వడ్డీ తిరిగి చెల్లించే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 28,450 మందికి రూ.76.23 లక్షలు జమ కానున్నదని తెలిపారు. ఈకార్యక్రమానికి జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరం నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రి నారాయణస్వామి, రాష్ట్ర అటవీ, విద్యుత్ పర్యావరణ శాస్త్రసాంకేతిక భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక అభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా, రాజంపేట, చిత్తూరు ఎంపీలు పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి, ఎన్.రెడ్డప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

నగరి పీఏసీఎస్‌కు స్టార్ కోడ్ సర్టిఫికేట్

డిల్లీలో నిర్వహించిన 'సహకార్‌సే సమృద్ధి' కార్యక్రమంలో అందజేత



ప్రజాశక్తి- నగరి: నగరి పీఏసీఎస్‌కు స్టార్ కోడ్ సర్టిఫికేట్ దక్కింది. ఆదివారం డిల్లీలో నిర్వహించిన సహకార్‌సే సమృద్ధి కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సహకార కేంద్ర అధికారులు పీఏసీఎస్ సీఈవో తులసి, అధ్యక్షులు తిరుమలరెడ్డికి అవార్డును అందజేశారు. అవార్డు దక్కడంపై అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాకు సంబంధించి నగరి, చిత్తూరు, పలమనేరు పీఏసీఎస్‌లకు ప్రోగ్రెస్‌ను అనుసరించి స్టార్ కోడ్‌లు అందజేశారన్నారు. త్వరలో దేశవ్యాప్తంగా 2వేల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పరిధిలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ కేంద్రాలను ప్రారంభించనున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్న సహకార కేంద్రాని ప్రస్తుతం వచ్చిన అవార్డు ప్రోత్సాహంతో మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. ఇప్పటికే సహకార సంఘం తరపున పెట్రోల్ బంకును నిర్వహిస్తున్నామని త్వరలో జనరిక్ మెడికల్ షాపులను కూడా నిర్వహిస్తామన్నారు.

డివిజన్ కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పంలో భాగంగా ఈనెల 12న జిల్లా కేంద్రమైన చిత్తూరు, డివిజన్ కేంద్రాలైన పలమనేరు, నగరి, కుప్పంలలో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న జిల్లా కేంద్రంలో జిల్లా ప్రధాన ఆస్పత్రిలో, కుప్పం పిఈఎస్ మెడికల్ కాలేజీలో, పలమనేరు సిహెచ్‌సి (కమ్యూనిటీ హెల్త్‌సెంటర్)లో జిల్లా ప్రధాన ఆసుపత్రి వారిచే రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలపారు. అలాగే నగరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ వారిచే రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతున్నదని స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చేవారు ఆయా డివిజన్ కేంద్రాల్లోని ఆర్డీఓ కార్యాలయాలలో పేరును ముందస్తుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

తాగునీటి శుభ్రత లేకుంటే చర్యలు తప్పవు




ప్రజాశక్తి- నగరి: తాగునీటి సరఫరాలో శుభ్రత పాటించకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ అన్నారు. బుధవారం నగరి పట్టణంలోని పలు వాటర్‌ప్లాంట్లను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్లాంట్ల వద్ద బాలకార్మికులు ఉన్నారా అని ఆరా తీశారు. వాటర్ క్యాన్లను, నీటి శుద్ధీకరణ యంత్రాలను పరిశీలించిన ఆయన శుద్ధీకరణకు వాడే రసాయన పదార్థాలను మోతాదుకు మించి వాడరాదని సూచించారు. తనిఖీ నిమిత్తం నీటి శాంపిల్స్ సేకరించారు. కొన్ని ప్రాంతాల్లో క్యాన్లు అపరిశుభ్రంగా ఉండటాన్ని కనుగొన్న ఆయన శుభ్రమైన క్యాన్లనే వాడాలని హెచ్చరించారు. తొలిసారి గనుక హెచ్చరికలతో వదలిపెడుతున్నామని మరోమారు పరిశీలనలో పునరావృత్తమైతే చర్యలు తప్పవన్నారు. రూరల్ వాటర్ సప్లై సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ అంబేద్కర్ భవన నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే వెంకటే గౌడకు నివేదించినట్లు ఎంపీపీ రెడ్డప్ప తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రజాప్రతినిధులతో కలిసి మండల అభివృద్ధిపై సమావేశమయ్యారు. మండలంలోని మాల మహానాడు ప్రజాసంఘాల నాయకులు మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి కృషిచేయాలని తెలియజేయడంతో ఎంపిపి ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఆయన వెంటనే చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు మండల కేంద్రంలో ఉన్న సర్వేనెంబర్ 108/3, 1.08 సెంట్లు స్థలం ఉన్నదని అందులో అంబేద్కర్ భవన నిర్మాణానికి కచ్చితంగా 50సెంట్లు స్థలాన్ని కేటాయించాలని తెలియజేసి సంబంధిత పత్రాన్ని మాల మహానాడు నాయకులకు అందించారు. జడ్పిటిసి సుష్మ కీర్తి, కన్వీనర్ బాగారెడ్డి, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, కొళత్తూరు సర్పంచ్ రవికుమార్, మాదనంపల్లి సర్పంచ్ రమేష్, అప్పనపల్లి సర్పంచ్ సుజాత ధనుంజయ, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

మాదిగలకు ప్రాధాన్యత కల్పించండి


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వచ్చే ఎన్నికల్లో సీట్ల కేటాయింపు విషయంలో మాదిగలకు ప్రాధాన్యత కల్పించాలని చిత్తూరు జిల్లా యాదమరి మండలం తెల్లరాళ్లపల్లెకు చెందిన ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎమ్మార్పీఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి వరదరాజులు మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజుతో కలిసి విజయవాడలో రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డిని కలిసి పూతలపట్టు నియోజకవర్గం వైసిపి టికెట్ కేటాయింపుపై చర్చించారు. అదే క్రమంలో పూతలపట్టు అసెంబ్లీ స్థానాన్ని వైసిపి అభ్యర్థిగా చిత్తూరు నగరానికి చెందిన కోడిగుట్ల వెంకటేష్‌కు కేటాయిస్తే తప్పకుండా ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉందుర్తి సుబ్బారావు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జ్ఞానజగదీష్ పాల్గొన్నారు.



పూతలపట్టు సీటు కేటాయించాలని కోరుతున్న కోడిగుట్ల వెంకటేష్

క్రిష్ణాపురం జలాశయంలో 12 వేల చేపపిల్లలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణాపురం జలాశయంలో 12వేల చేప పిల్లలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఆక్వా రంగానికి ప్రత్యేక పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. కృష్ణాపురం జలాశయం అభివృద్ధికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే జలాశయం కుడి, ఎడమ కాలువలను సందర్శించారు. జిల్లా ఎఫ్‌డిఓ రామోహన్ రావు, కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



జలాశయంలో చేపపిల్లలను విడుదల చేస్తున్న ఎంపీపీ లతబాలాజీ

5జీ కమ్యూనికేషన్ పై అవగాహన

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని మదర్ థెరిసా విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులలో నైపుణ్యం పెంపొందించడానికి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఇంజనీరింగ్ విభాగంలో గ్రీన్ మెన్ కంపెనీ సంయుక్తంగా కలిసి ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో ఒప్పందం కుదుర్చు ఉన్నట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యం పెంపొందించడమే ధ్యేయంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ఇందులో భాగంగా కళాశాలలో చదువుతున్న ఈసీఈ, ఈఈఈ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 5జీపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. జర్మనీ అకాడమిక్ ఆఫ్ డిజిటల్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. అకాడమిక్ అధికారి రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర.. నూతన క్రీడా చరిత్ర

మండల స్థాయి పోటీలను ప్రారంభించిన మంత్రి ఆర్కేరోజా



ప్రజాశక్తి- నగరి: ఆడుదాం ఆంధ్ర.. నూతన క్రీడాచరిత్ర అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం స్థానిక కేవీకే మైదానంలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను ఆమె ప్రారంభించారు. సత్రవాడ, ముడిపల్లి టీం మధ్య క్రికెట్ పోటీలోను, కాకవేడు అడవికొత్తూరు టీంల మధ్య జరిగిన వాలీబాల్ పోటీలోను మంత్రి క్రీడాకారులతో పాటు ఆడుతూ ఉత్సాహపరిచారు. ఆమె మాట్లాడుతూ యువతలో, క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించే విధంగా జగనన్న కృషి చేస్తున్నారన్నారు. చదువులో అయినా క్రీడలల్లో అయినా గెలుపు సాధించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. గెలవడానికి చిత్తశుద్ధిగా కష్టపడి ప్రాక్టీస్ చేసి పోటీ పడితే గెలుపు వచ్చేది పక్కా అన్నారు. గెలిచినప్పుడు చరిత్రలో నిలిచి పోతామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో విజేతలకు గ్రూప్ వన్ పోస్టులతో పాటు పలు అకాడమీలు నిర్మించి క్రీడాకారులకు కోచింగ్ క్యాంపులు పెట్టి ట్రైనింగ్ ఇవ్వడానికి కూడా అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. 15,004 సచివాలయాల పరిధిలోను పోటీలు ముగిసి మండలస్థాయి పోటీలు ప్రారంభం అవుతోందన్నారు. ఈ పోటీల అనంతరం నియోజకవర్గస్థాయి, జిల్లా, రాష్ట్రస్థాయి అంటూ 2.99 లక్షల మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, వైస్ ఎంపీపీలు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రీడలను పరిశీలించిన జెడ్‌పి సీఈవో

చిత్తూరుఅర్బన్: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా బుధవారం పూతలపట్టు జడ్పీ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న మండలస్థాయి క్రీడాపోటీలను జెడ్‌పి సీఈవో పరిశీలించారు. ఈసందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ఎంపిడిఒ గౌరి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రలో గాయపడ్డ మహిళా పిఈటి

ఆడుదాం ఆంధ్ర కార్యాక్రమం బుధవారం యాదమరి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 14కండ్రిగలో మండలస్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో పిఈటి మాధవి గాయపడ్డారు. ఆమెను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జాయింట్ కలెక్టర్, జెడ్‌పి సీఈవో, డీఈవోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పీఈటీని పరామర్శించి మెరుగైన వైద్య అందించాలని వైద్యులకు సూచించారు.



పీఈటీ టీచర్‌ను పరామర్శిస్తున్న జెడ్‌పి సీఈవో

కార్వేటినగరం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రారంభించారని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో మండలస్థాయి ఆడుదాం.. ఆంధ్ర క్రీడలను సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో కాగడ వెలిగించి బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఎంపిడిఓ మోహన్ మురళీ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచినవారికి నగదు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఈవో పీఎస్.మణి, వ్యాయామ ఉపాధ్యాయులు మురళీకృష్ణరాజు, తిరుమలరాజు, మాండవ్య పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఆటలతోనే ఉల్లాసమని ఎంపీపీ అమరావతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఇన్చార్జ్ ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు దత్తు రెడ్డి, ఏఎంసి చైర్మన్ నారే సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోనీ 19 సచివాలయాల పరిధిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో భాగంగా వాలీబాల్ పోటీల్లో పాతూరునత్తం జట్టు విజేతగా నిలిచింది. వీరిని సర్పంచ్ రోజా శివశంకర్, ఎంపిపి మొగసాల రెడ్డప్ప ప్రశంసించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కరబరచాలని సూచించారు. ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్ ఆచారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణాల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, క్రీడాకారుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు జ్యోతి ప్రజ్వలన చేయగా పోటీలను ప్రజాప్రతినిధులు ఆడి ప్రారంభించారు. మొదటిరోజు 13 పంచాయతీలకు చెందిన క్రికెట్ టీములు రెండు క్రీడాప్రాంగణాలలోనూ ఆడగా వ్యాయామ ఉపాధ్యాయులు అంపేర్‌లుగా వ్యవహరించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు, ఎంఈఓ శివరత్న, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లీశ్వరి, చిన్నప్ప, కరుణానిధి పాల్గొన్నారు.

క్రీడాకారుల మధ్య ఘర్షణ

గుడిపల్లి: మండలంలో బుధవారం మండలస్థాయి క్రీడాపోటీలను మండల అధికారులు ప్రారంభించారు. ఈ క్రీడాపోటీల్లో ఆటగాళ్ల మధ్య స్వల్పఘర్షణ చోటు చేసుకుంది. ఆటగాళ్ల మధ్య వాదోపవాదాలు జరుగుతున్న సందర్భంలో పలువురు క్రీడాకారులు కొట్టుకోవడంతో ఆపంచాయతీ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడంతో ఈకార్యక్రమాన్ని అధికారులు కొంత సేపు ఆపేశారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఘర్షణలకు పాల్పడిన క్రీడాకారులను స్టేషన్‌కు తరలించారు. మండల రక్షణ అధికారి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ యువత క్రీడల్లో క్రీడాస్ఫూర్తితో మెలగాలని ఇటువంటి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఘర్షణకు పాల్పడిన క్రీడాకారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఘర్షణ పడుతున్న క్రీడాకారులు



బైరెడ్డిపల్లిలో విజేతలుగా నిలిచిన పాతూరునత్తం జట్టు

ఏడాది తర్వాత మార్కెట్ కమిటీ నిర్మాణ పనులు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని కందూరు మార్గంలో రూ.5.75కోట్లుతో నిర్మిస్తున్న మార్కెట్ కమిటీ నిర్మాణ పనులు ఏడాది కాలంగా బిల్లులు అందక నిలిచిపోవడంతో తిరిగి వారం రోజులుగా పనులు ప్రారంభమై చురుగ్గా జరుగుతున్నాయి. ఏడాది క్రితం వరకు సిమెంటు రోడ్లు, షెడ్లు నిర్మాణం కోసం పిల్లర్లు వేసి ఆపై బిల్లులు రాకపోవడంతో నిర్వాహకులు పనులను నిలిపివేశారు. దీంతో మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ నాగేశ్వరరావు మార్కెట్ కమిటీ నిర్మాణ పనులు ఆగిపోయాయి అన్న విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పనులు జరిగే విధంగా చూడాలని కోరడంతో ఆయన ఆదేశాల మేరకు తిరిగి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినట్లు సమాచారం. నిర్మాణ పనులను వేగవంతంగా చేసి రెండు నెలల లోపు పూర్తి చేసే విధంగా పనులు చేస్తున్నారు. ఏది ఏమైనా మార్కెట్ కమిటీ నిర్మాణం పూర్తి చేసుకొని రైతులకు అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత మామిడి, టమోటా, ఇతర కూరగాయలు పండించే రైతులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని రైతులు అంటున్నారు.



మార్కెట్ కమిటీ వద్ద జరుగుతున్న పనులు

అంబేద్కర్ జీవిత విశేషాలపై ఛాయాచిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సామాజిక సమతా సంకల్పం (జన్ భాగీదారీ)లో భాగంగా జిల్లా కేంద్రంలో ఈనెల 11న ఉదయం 8.30 గంటలకు దుర్గా సర్కిల్ వద్ద గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేసే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, విద్యార్థులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో భాగంగా పిసిఆర్ జూనియర్ కాలేజీలోని ఒకేషనల్ కాలేజీ భవనంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ వారు ప్రారంభించనున్నారని, ఈనెల 11 నుండి 19వ తేదీ వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని, ప్రజలు విద్యార్థులు మహిళలు ఈ ప్రదర్శనను తిలకించాలని తెలిపారు.

ప్లెక్సీలు చింపే నీచబుద్ధి మానుకోండి: టిడిపి హితవు



ప్రజాశక్తి- పుంగనూరు: తెలుగుదేశం పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి మండల పర్యటన సందర్భంగా స్వాగతం పలుకుతూ వేస్తున్న బ్యానర్లను చింపే నీచబుద్ధిని మానుకోవాలని మైనార్టీ నేత సయ్యద్ షెల్‌బాష తీవ్రంగా హెచ్చరించారు. చల్లా రామచంద్రారెడ్డి మండల పర్యటన సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను ప్రత్యర్థులు చింపివేసిన సంఘటనను బుధవారం తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తమ నాయకులపై అభిమానంతో ఫ్లెక్సీలను ముద్రించి స్వాగతం పలుకుతూ వేస్తున్న బ్యానర్లను చూసి ఓర్వలేక ఇలాంటి నీచమైన పనిచేస్తున్నారని ఆరోపించారు. దమ్ము, ధైర్యం ఉన్న నాయకులు ఎదురుగా వచ్చి ఏవైనా చేయాలని, అలా కాకుండా రహస్యంగా వచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేయడం పద్ధతిగా లేదన్నారు. మీరు చేసే ప్రతిపనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. చల్లా రామచంద్రారెడ్డి మండల పర్యటన సందర్భంగా ప్రజల్లో అనూహ్యస్పందన వస్తున్నదని ఇది చూసి ఓర్వలేకనే ఫ్లెక్సీలను చింపుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన ప్రజలు తెలుగుదేశం పార్టీకి నీరాజనాలు పలుకుతున్నారని మంగళహారతులు ఇస్తున్నారని దీనిని బట్టి చూస్తేనే వైసిపి పైన ప్రజలకు ఉన్న అభిమానం అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ గిరి, సద్దాంబాష, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకూ రాజ్యాంగ హక్కులున్నాయ్..



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వయోవృద్ధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉపయోగించుకునేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక డిఆర్‌డిఏ శిక్షణ కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి, సాంఘిక సంక్షేమ, స్త్రీశిశు సంక్షేమ, వయోవృద్ధులు విభిన్న సంక్షేమ శాఖల అధికారులు పిడి డిఆర్డిఏ తులసి, సాంఘిక సంక్షేమశాఖ, సాధికారత అధికారిణి డాక్టర్ రాజలక్ష్మిలతో కలిసి వయోవృద్ధుల సంక్షేమం, వారి సమస్యలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను వారు ఉపయోగించుకొనేలా వారి సంక్షేమానికి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. డిఆర్డిఏ పిడి మాట్లాడుతూ వయోవృద్ధులకు సంబంధించిన సమస్యలను అన్నింటిని పరిష్కరించడానికి తగినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బలహీన వర్గాల ఆశాజ్యోతి బిఆర్. అంబేద్కర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని మేయర్ ఎస్.అముద అన్నారు. బుధవారం నగరంలోని 39వవార్డులో 'జన్ బాగీదారి'లో భాగంగా సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో మేయర్ పాల్గొని బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మేయర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా వార్డు సచివాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

పోలింగ్ కేంద్రాల్లో తనిఖీలు



ప్రజాశక్తి -సదుం: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను చిత్తూరు జెడ్‌పి సీఈఓ, పుంగనూరు నియోజకవర్గం ఈఆర్ఓ పి.ప్రభాకర్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లోని కనీస మౌలిక సౌకర్యాలైన విద్యుత్, టాయిలెట్స్, ర్యాంపులు, తాగునీరు ఏర్పాట్లు తదితర విషయాలను సంబంధిత ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఓ వరప్రసాద్, ఆర్ఐ ప్రసాద్, బిఎల్ఓలు పాల్గొన్నారు.

గుండె ఆపరేషన్‌కు ఆర్థికసాయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక శంకరయ్య గుంట మాజీ తెలుగుదేశం కౌన్సిలర్ మురళి కోడలు మీనాక్షి గుండె జబ్బుతో బాధపడుతుండటంతో వైద్యఖర్చుల నిమిత్తం జీజేఎం ట్రస్ట్ అధినేత జగన్మోహన్ లక్ష రూపాయలు ఆర్థిక సాయంగా అందించారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో వైద్యం చేయించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు జీజేఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్మోహన్ దృష్టికి తీసుకురావడంతో ఆయన లక్ష రూపాయల ఆర్థికసహాయాన్ని అందించారు.

'లక్ష్మీనరసింహ'లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: శ్రీలక్ష్మీ నరసింహా కళాశాలలో సంక్రాంతి సంబరాలతో సందడి వాతవరణాన్ని తలపించింది. బుధవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలను వైభవంగా జరుపుకున్నారు. విద్యార్థులు కళాశాల ఆవరణాన్ని రంగురంగుల రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, అధ్యాపకులకు, ఛాత్రోపాధ్యాయులకు ప్రసాదాలను పంచిపెట్టి భోగిమంట చుట్టు గొబ్బిళ్ళు తట్టారు. డైరెక్టర్లు ధనంజయరెడ్డి, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, కిషోర్, మహేశ్వరరాజు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్థానిక ప్రాథమిక పాఠశాలలో బుధవారం కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు కోలాహలంగా నిర్వహించారు. ముగ్గులపోటీల్లో విద్యార్థినులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. ఆకర్షణీయమైన ముగ్గులు వేసి విజేతలుగా ఎంపికైన వారికి ఎంఈఓలు సాయిలీల, సుబ్రహ్మణ్యం బహుమతులు అందజేశారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చైతన్య, ఎండీహెచ్ ట్రస్ట్ చైర్మన్ పవన్ కళ్యాణ్, విశ్రాంత ఉపాధ్యాయులు మునెప్ప, చంద్రశేఖర్, కళాతరంగిణి వ్యవస్థాపకులు రాజేష్ బాబు, న్యాయ నిర్ణేత మమత, నిర్వాహకులు మురళీధర్, శ్రీనివాసులు, మస్తాన్ పాల్గొన్నారు.

చంద్రబాబే ష్యూరిటీ

జిల్లా టిడిపి నేత ఎర్రగుంట్ల క్రిష్టమనాయుడు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మహానాడులో ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీల పథకానికి చంద్రబాబు నాయుడు ప్రధాన ష్యూరిటీ అని జిల్లా టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి కృష్ణమనాయుడు అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గంగాధర నెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ నరాలకండిగ గ్రామంలో బుధవారం టిడిపి నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. మండల టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు జ్యోతి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు సీఎం జగన్ రెడ్డి మోసపూరిత మాటలు నమ్మి మరోసారి భవిష్యత్తును అధోగతిపాలు చేసుకోకుండా జాగ్రత్త పడాలని కోరారు. టిడిపి నేతలు తులసిరెడ్డి, రూపేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శంకర్ యాదవ్, జీవరత్నం యాదవ్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

సోనియా మృతికి నివాళి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీనివాసులు కుమార్తె సోనియా (23) పార్థివ దేహానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ నివాళులర్పించారు. స్థానిక నాయకుల సమాచారంతో సోనియా మరణవార్త తెలుసుకొని వారి స్వగ్రామానికి వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, అన్ని విధాల ఆదుకుంటానని తెలియజేశారు. బాగా రెడ్డి, వైస్ ఎంపీపీ జీడీ బాబు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

నాటుసారా స్వాధీనం - వ్యక్తి అరెస్టు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: నాటు సారా స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు చిత్తూరు రూరల్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని గాంధీనగర్ క్రాస్ వద్ద తనిఖీలు చేపట్టగా బంగారుపాలెం మండలం రాగిమాను పెంట గ్రామానికి చెందిన చంగల్ రాయులు 10 లీటర్ల నాటు సారా క్యాన్‌లో నింపుకుని విక్రయించేందుకు వెళుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు సిఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ ఎస్ఐ మోహన్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజ్, కానిస్టేబుల్ వెంకటేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గ్రామప్రజలకు అధునాతన వైద్యం అందించాలనే లక్ష్యంతో తిరుపతిలోని రమాదేవి మల్లీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు మండలంలోని మంగళపల్లి పంచాయతీ కుప్పలపల్లి గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారని తెలిపారు. ఈ వైద్యశిభిరంలో 192 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. అలాగే వివిధ అనారోగ్య కారణాలతో 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు, వీరిని రమాదేవి హాస్పిటల్‌కు తరలించి వైద్యం చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. డాక్టర్ వేదతేజ, డాక్టర్ కుప్పల కీర్తి, డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి- బంగారు పాల్యం: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ మురళీమోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తెలుగుదేశం కార్యాలయంలోని అన్న క్యాంటీన్‌లో అన్నదాన చేశారు. మురళీమోహన్ మాట్లాడుతూ పేదలకు కడుపునిండా భోజనం పెట్టడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, మండల ప్రధానకార్యదర్శి జనార్దన్ గౌడ్, మాజీ సింగల్‌విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, వాణిజ్య విభాగ అధ్యక్షులు వంశీ చౌదరి, సూరి రమేష్, లోకనాథ నాయుడు పాల్గొన్నారు.

ఎస్టియు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలం రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యవర్గ ఎన్నికలు బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శ్రీరామపురంలో ఎన్నికల పరిశీలకులుగా లింగమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏకగ్రీవంగా మూడోసారి మండల అధ్యక్షుడిగా బాబు రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గురుప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా శివప్రకాష్ బాబు ఎన్నికయ్యారు. మండల సిపిఎస్ కన్వీనర్‌గా హరీష్, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా బాలాజీ, మహిళా కన్వీనర్‌గా స్వర్ణకుమారి, జిల్లా కౌన్సిలర్‌లుగా జయరామప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.